
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
సిద్దిపేట
శుక్రవారం 18 జులై 2025


మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ





వేదికపై గవర్నర్‌తో పాటు మంత్రులు, కలెక్టర్లు, అధికారులు

ఆరోగ్య హుస్నాబాదే లక్ష్యంగా..

- పొన్నం సత్తయ్య ట్రస్టు ఆధ్వర్యంలో.. నియోజకవర్గంలోని 276 మహిళా సంఘాలకు స్టీల్ సామగ్రి అందజేత
- హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్
- వేలాదిగా తరలివచ్చిన మహిళలు
- ఈ కార్యక్రమం ఎంతో నచ్చింది : గవర్నర్

కోహెడ, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య హుస్నాబాద్ నియోజకవర్గమే లక్ష్యంగా కోహెడ మండల కేంద్రంలో గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్ తన తండ్రి పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా సంఘాలకు స్టీల్ బ్యాంకు వితరణ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. నియోజకవర్గానికి చెందిన మహిళలు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పెద్దఎత్తున హాజరయ్యారు. నియోజకవర్గంలోని 160 గ్రామాలకు చెందిన 276 మహిళా సంఘాలకు ఈ స్టీల్ బ్యాంకు కిట్లను పంపిణీ చేశారు. ఇప్పటికే నియోజకవర్గంలోని 340 హోటళ్లకు 3,400 స్టీల్ గ్లాసులు పంపిణీ చేశారు. నియోజకవర్గ ఆరోగ్యమే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమం చేపట్టిన మంత్రి పొన్నం ప్రభాకర్‌పై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రులు కొండా సురేఖతో పాటు ఐఏఎస్ అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమం తనకు ఎంతో నచ్చిందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. కార్యక్రమంలోనే

మిగతా 8వ పేజీలో


సభకు హాజరైన మహిళలు


మహిళా సంఘాలకు స్టీల్ సామగ్రిని అందజేస్తున్న గవర్నర్, మంత్రులు

రోగాల బారిన పడొద్దు : మంత్రి పొన్నం

తన నియోజకవర్గ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ఈ స్టీల్ బ్యాంకులు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ జిల్లాలో తాను ఎమ్మెల్యేగా గెలిచే నాటికే స్టీల్ బ్యాంకు కొనసాగుతున్నాయని, అందులో భాగంగానే ఇక్కడ కూడా వీటిని ఏర్పాటు చేసి మహిళా సంఘాలకు అందిస్తున్నామన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలని ఉజ్జయిని మహంకాళిని వేడుకున్నట్లు చెప్పారు.

ఆగస్టు 15లోపు ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ

- మొదటి రిఫైన్డ్ ఫ్యాక్టరీ కూడా ఇక్కడే పెడతాం : వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మొక్కలు నాటిన అనంతరం మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, కలెక్టర్

కోహెడ/నంగునూరు జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు 15 లోపు సీఎం రేవంత్‌రెడ్డితో నంగునూరు మండలం నర్మెట్టలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తెలంగాణలో మొదటగా రిఫైన్డ్ ఫ్యాక్టరీ ఇక్కడే పెడతామని చెప్పారు. ఆయిల్‌పామ్ సాగులో హుస్నాబాద్ ఆదర్శంగా నిలిచేలా ఈ ప్రాంత రైతులు కృషి చేయాలని కోరారు. గురువారం హుస్నాబాద్ నియోజకవర్గంలోని కోహెడ మండలం బస్వాపూర్‌లో మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్‌ను మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, కలెక్టర్ హైమావతితో కలిసి ప్రారంభించారు. బస్వాపూర్‌లో ఏనుగు రామారావు పొలంలో 50 ఎకరాల్లో ఈ ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. అనంతరం జరిగిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడారు. పొన్నం ప్రభాకర్ మీ శాసన సభ్యులు కావడం మీ అదృష్టమని, నిరంతరం హుస్నాబాద్ కోసమే పరితపిస్తుంటారన్నారు. ఖమ్మం తరువాత అత్యధిక ఆయిల్‌పామ్ సాగు సిద్దిపేట జిల్లాలోనే సాగవుతుందన్నారు. ఆయిల్ పామ్ పంటలతో తెలంగాణ పచ్చబడాలి అని ఆయన అన్నారు. బయట దేశాల నుంచి వచ్చే ఆయిల్ మీద సుంకం తగ్గించారని, దాని వల్ల రాష్ట్రానికి ఆదాయం తగ్గిందని ఆయన చెప్పారు. ఈ విషయమై దక్షిణ భారత మంత్రులను తీసుకొని ప్రధాని దగ్గరకు వెళ్తున్నామని, 'సరిపడా పాంఆయిల్ ఇస్తాం.. క్వింటాకు రూ.25వేలు ఇవ్వ'మని అడుగుతామన్నారు. తెలంగాణ మొత్తానికి హుస్నాబాద్ ఆయిల్‌పామ్ గుండెకాయ లాంటిదని చెప్పారు. కర్మాగారం నిర్మాణంతో ఈ ప్రాంత రైతులకు లబ్ధి చేకూరడంతో పాటు, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

గుంట భూమి కూడా వృథాగా ఉండొద్దు : పొన్నం

హుస్నాబాద్ నియోజకవర్గంలో గుంట భూమి కూడా బీడు పడి ఉండొద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టును కుర్చీ వేసుకుని పూర్తి చేస్తామన్న నాయకులు పత్తా లేకుండా పోయారని ఎద్దేవా చేశారు. గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేస్తామని, నీరు ఇచ్చే బాధ్యత తనదేనని మంత్రి స్పష్టం చేశారు. ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం కాగానే రైతుల పంట నుంచి ఫ్యాకర్టరీ వరకు ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారు.

నేనూ రైతు బిడ్డనే.. : కలెక్టర్

"నేనూ రైతు బిడ్డనే 18 సంవత్సరాల వయస్సు వచ్చే వరకు వ్యవసాయ పనులు చేశా" అని కలెక్టర్ హైమావతి అన్నారు. రైతులకు సహాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. కార్యక్రమంలో ఆయిల్ పామ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ భాషా, అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్, మార్కెట్ కమిటీ చైర్మన్లు తిరుపతిరెడ్డి, పోయిని నిర్మల, వ్యవసాయ శాఖ జిల్లా, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ఫ్యాక్టరీని సందర్శించిన మంత్రి తుమ్మల

నంగునూరు మండలం నర్మెట్టలో నిర్మిస్తున్న ఆయిల్‌పామ్ కర్మాగారాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆకస్మికంగా సందర్శించి పనులను పరిశీలించారు. ఆగస్టు రెండో వారంలో ఆయిల్ పామ్ కర్మాగారం ప్రారంభోత్సవంతో పాటు రిఫైనరీ పనులకు శంకుస్థాపన చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.

మంత్రి తోటలోని భారీ ఆయిల్‌పామ్ గెల

మంత్రి నాగేశ్వర్ తోటలో పండిన ఆయిల్ పామ్ భారీ గెల తీసుకువచ్చి కార్యక్రమంలో ప్రదర్శించారు. దాని బరువు 60 కిలోలు ఉంటుంది. సభా వేదికపై దానిని తీసుకు వచ్చినప్పుడు జాగ్రత్తగా దించమని మంత్రి సిబ్బందికి చెప్పారు.

సీపీఐ జిల్లా కార్యదర్శిగా మంద పవన్

హుస్నాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా కార్యదర్శిగా మంద పవన్ నాలుగోసారి ఎన్నికయ్యారు. జిల్లా సహాయ కార్యదర్శిగా హుస్నాబాద్‌కు చెందిన గడిపె మల్లేశ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మంద పవన్ విలేకరులతో బుధవారం జరిగిన సీపీఐ జిల్లా మహాసభల వివరాలను వెల్లడించారు. జిల్లా కార్యదర్శిగా తనను, సహాయ కార్యదర్శిగా మల్లేశ్ ను ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో సీపీఐ నాయకులు ఎడల వనేష్, కొయ్యడ కొంరయ్య, ఎగ్గోజు సుదర్శన్‌లుండగా జిల్లా కార్యవర్గ సభ్యులుగా జాగీర్ సత్యనారాయణ, దయానందరెడ్డి, పోతిరెడ్డి వెంకటరెడ్డి, కనుకుంట్ల శంకర్, లక్ష్మన్, జేరిపోతుల జనార్దన్, అందె అశోక్, కొమ్ముల భాస్కర్, పిల్లా రజని ఎన్నికయ్యారు.

ఇసుక..బంగారమే

- డీడీలు చెల్లించినా వారం ఆగాల్సిందే
- క్వారీల వద్ద వాహనదారుల నిరీక్షణ
- కృత్రిమ కొరత సృష్టిస్తున్న కొందరు
- బ్లాక్‌మార్కెట్‌కు మార్గం సుగమం
- ఇందిరమ్మ ఇళ్లకు తప్పని అవస్థలు

ఇసుక బంగారంగా మారింది. క్వారీ నిర్వాహకుల కారణంగా భవన నిర్మాణాలు చేపట్టాలనుకునేవారికి ఇబ్బందులు తప్పడం లేదు. ఇందిరమ్మ ఇళ్లకు, అభివృద్ధి పనులకూ ఇసుక దొరకడం లేదు. డీడీలు కట్టినా.. కనీసం వారం వరకు క్వారీల వద్ద పడిగాపులు పడాల్సివస్తోంది. భార్యాపిల్లల్ని వదిలి వచ్చి వారం అవుతోందని.. ఇసుక ఎప్పుడు ఇస్తారంటూ లారీ డ్రైవర్లు ధర్నాలు చేస్తున్నారంటే పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.
-దుబ్బాక, జూలై 17 (ఆంధ్రజ్యోతి)


ఇసుక కోసం క్వారీల వద్ద ఆగి ఉన్న లారీలు

జిల్లాలో సొంత ఇంటి కలకు ఇసుక అడ్డంకిగా మారింది. ముగ్గుపోసి.. నిర్మాణం ప్రారంభిద్దాం అంటే ఇసుక కోసం నిరీక్షణ తప్పడం లేదు. ఇదే అదునుగా బ్లాక్ మార్కెట్‌లో టన్నుకు రూ.27 వందలు వసూలు చేస్తుండటంతో తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా డీడీలు కట్టి ఎదురుచూస్తున్నారు. జిల్లాలో టీజీఎండీసీ ద్వారా ఇసుక సరఫరాలో జాప్యం జరుగుతోంది. ఆన్‌లైన్ ద్వారా 35 టన్నులకు రూ.16,050 డీడీ రూపంలో చెల్లిస్తే ఇసుకను సరఫరా చేస్తారు. అంటే టన్నుకు రూ. 1,600 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. జీఎస్టీతో కిరాయి కలిపితే టన్ను రూ.1,800 వరకు అవుతుంది. కొందరు వాహన యజమానులు వారే డీడీలు చెల్లించి ఇసుక తీసుకువచ్చి టన్నుకు రూ.2,400 చొప్పున విక్రయిస్తున్నారు.

కృత్రిమ కొరత

జిల్లా పెద్దపల్లి జిల్లా ముత్తారం క్వారీ నుంచి ఇసుక సరఫరా జరుగుతుంది. ఇక్కడ వాహన యజమానులు, దళారులు కలిసి ఇసుక కృతిమ కొరత సృష్టిస్తున్నారు. ఇసుక దొరకడం లేదన్న సాకుతో టన్ను రూ.2,700 వరకు విక్రయిస్తున్నారు. ముత్తారం క్వారీతో పాటు తాటిచెర్ల, ఖమ్మంపల్లి క్వారీల వద్ద నుంచి కూడా ఇసుక తీసుకువస్తుండగా, టోకెన్ ప్రకారం ఇసుక సరఫరా చేయడం లేదు. డీడీలు కట్టి క్యూలో ఉన్న వారికి కాకుండా బ్లాక్ మార్కెట్ వారికి సహకరిస్తూ వారికి ముందుగా ఇసుక లోడ్ చేసి పంపిస్తున్నారు. దీంతో సక్రమంగా డీడీలు చెల్లించి వేచి ఉన్న వారికి ఇబ్బందులు తప్పడం లేదు. మరోపక్క ఇల్లు, ఇతర నిర్మాణాలు ప్రారంభించిన వారు వారాల తరబడి వేచి ఉండలేక బ్లాక్ మార్కెట్‌లో ఎక్కువ ధర పెట్టి ఇసుక కొనుగోలు చేయాల్సి వస్తోంది.

'ఇందిరమ్మ' పేరిట అక్రమాలు

నిజమైన ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక దొరకడం గగనమైపోతున్న పరిస్థితుల్లో.. ఈ పథకం పేరిట కొందరు అక్రమరవాణా చేస్తున్నారు. ఇందిరమ్మ లబ్ధిదారులకు ఎనిమిది ట్రాక్టర్ల(25 టన్నులు) ఇసుక ప్రభుత్వం ఉచితంగా ఇస్తోంది. దీనిని అడ్డుగా పెట్టుకుని దుబ్బాక మండలం కూడవెల్లి, బెజ్జంకి మండలం మానేరు, మోహితుమ్మెదవాగు, ఇల్లంతకుంట మండలం నుంచి, రాజన్న సిరిసిల్ల జిల్లా మానేరు వాగు నుంచి కొందరు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసమని రాత్రి సమయంలో ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లను దుబ్బాక పోలీసులు ఇటీవల పట్టుకున్నారు. ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక ఉచితంగానే ఇస్తున్నా.. కొందరు ట్రాక్టర్ డ్రైవర్లు మాత్రం వారి నుంచి ముక్కుపిండి డబ్బు వసూలు చేస్తున్నారు. ఇసుక దొరకడం లేదని ఒక్కో ట్రాక్టర్ ఇసుకను రూ. 8,000కు అమ్ముతున్నారు. ఈ నేపథ్యం అధికారులు స్పందించి ఇసుక కృత్రిమ కొరతను అరికట్టాలని, ఇందిరమ్మ లబ్ధిదారులకు ఉచిత ఇసుక సరఫరా చేయాలని కోరుతున్నారు.

ట్రాక్టర్‌కు 6,500 వసూలు!

దుబ్బాకలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పేరిట చేస్తున్న ఇసుక అక్రమ దందా గురువారం బయటపడింది. పట్టణంలో 22 మంది లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక కోసం తహసీల్దార్ అనుమతి ఇచ్చారు. దుంపలపల్లి వార్డులో నిర్మాణాలు చేపడుతున్నారు. ఇసుక తీసుకొచ్చిన ట్రాక్టర్ యజమానులు ఇదే అదునుగా 6,500కు ట్రిప్పు చొప్పున వసూలు చేశారు. నిబంధనల మేరకు 25 ట్రాక్టర్ల వరకు ఉచితంగా ఇసుకను అందించాలి. కానీ కొందరు రూ.6,500కు, ఇందిరమ్మ ఇళ్ల పేరుతో మరికొందరికి రూ.8వేలకు విక్రయించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్రీరాంనరేందర్ అధికారుల దృష్టికి తేవడంతో వారు చర్యలకు పూనుకున్నారు.


శివాజీ విగ్రహం వద్ద సుందరీకరణ పనులు చేపడుతున్న సిబ్బంది

సుందరీకరణకు చర్యలు

- దుబ్బాక పట్టణంలోని జంక్షన్లలో గడ్డి తొలగింపు, విద్యుత్ దీపాల పునరుద్ధరణ
- 'ఆంధ్రజ్యోతి' వార్తకు స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దుబ్బాక, జూలై 17 (ఆంధ్రజ్యోతి): దుబ్బాకలో రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన జంక్షన్లు కళావిహీనంగా మారడంపై 'ఆంధ్రజ్యోతి' దినపత్రిలో బుధవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దుబ్బాక ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద, దుంపలపల్లి వార్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పెరిగిన గడ్డిని తొలగించారు. ఫౌంటెన్‌లో పాకురు పట్టిన నీటిని తొలగించారు. విద్యుత్ దీపాలను పునరుద్ధరించారు. అలకంరణ దీపాలను టెక్నీషన్ ద్వారా త్వరలోనే మరమ్మతులు చేయించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమేష్‌కుమార్ తెలిపారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద..

నువ్వా..నేనా!

- గజ్వేల్ నియోజకవర్గంలో మొదలైన రాజకీయ వేడి
- పట్టు నిలుపుకునేందుకు బీఆర్ఎస్ యత్నం
- పట్టు సాధించేందుకు కాంగ్రెస్ వ్యూహం
- ఆధిపత్యం కోసం బీజేపీ ప్రయత్నాలు
- మొదలైన చేరికలు

గజ్వేల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ నియోజకవర్గంలో రాజకీయ వేడి మొదలైంది. నువ్వా..నేనా అనే రీతిలో రాజకీయం రంజుగా సాగుతోంది. ఓ వైపు స్థానిక సంస్థల ఎన్నికల గంట మోగుతోందన్న ప్రచారం జరుగుతుండడంతో ఒక్కసారిగా రాజకీయ పార్టీలు యాక్టివ్ అయ్యాయి. చేరికలతో కాంగ్రెస్, బీజేపీ స్థానిక సమరాన్ని మొదలుపెట్టగా, పట్టును నిలుపుకునేందుకు బీఆర్ఎస్ తాపత్రయపడుతుంది. నియోజకవర్గంలో గట్టి పట్టు ఉన్న బీఆర్ఎస్ ఏ నాయకుడు పార్టీ వదిలి వెళ్లకుండా జాగ్రత్త పడుతోంది. బీజేపీ, కాంగ్రెస్ దూకుడుగా చేరికల వ్యవహారాన్ని ముమ్మరం చేశాయి.

అటు నుంచి ఇటు.. ఇటు నుంచి అటు

నియోజకవర్గంలో ఆయా పార్టీల్లో చేరికలు వేగవంతమయ్యాయి. గత అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా కాంగ్రెస్ నుంచి మరలా బీజేపీలోకి చేరారు. ఆయనతో పాటు ఆయన అనుచర గణమంతా బీజేపీలో చేరింది. అప్రమత్తమైన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి బీజేపీలో చేరిన వారిలో పలువురిని తిరిగి కాంగ్రెస్‌లో చేరేలా ప్రయత్నాలు చేసి సఫలమయ్యారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి చేరాలనుకున్న పలువురికి బీఆర్ఎస్ నాయకులు అభయహస్తం ఇచ్చి ప్రస్తుతానికి ఏ పార్టీలో చేరకుండా ఆపారు. త్వరలోనే వారిని బీఆర్ఎస్‌లో చేర్పించేందుకు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఆధిపత్యం కోసం ఆరాటం

గజ్వేల్ నియోజకవర్గంలో ఆధిపత్యం కోసం కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ తాపత్రయపడుతున్నాయి. బీఆర్ఎస్ నుంచి మాజీ ముఖ్యమంత్రి ఎమ్మెల్యేగా ఉండడంతో పాటు ప్రతిపక్ష నేతగా ఉండడంతో ఆ పార్టీ నుంచి ఏ నాయకుడు ఇప్పటి వరకూ ఇతర పార్టీల వైపునకు వెళ్లలేదు. బీజేపీ నుంచి కాంగ్రెస్, కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరికలు కొనసాగుతున్నాయి. ఈ పోటీ నేపథ్యంలో బీఆర్ఎస్ ఆత్మరక్షణగా వ్యవహరిస్తూ ఉన్న నాయకులు జారిపోకుండా జాగ్రత్త పడుతుంది. ఎలాగైనా గజ్వేల్ పట్టు నిలుపుకోవాలని బీఆర్ఎస్, ఆధిపత్యం పొందాలని బీజేపీ, పూర్వ వైభవాన్ని సాధించే దిశగా కాంగ్రెస్ తమ వంతు ప్రయత్నాలు చేస్తోంది. అధికార కాంగ్రెస్ పార్టీ పలువురు అధికారుల బదిలీలను ఇటీవల చేపట్టి, వారికి అనుకూలంగా ఉండే అధికారులను నియమించుకుంటుంది.!!


భోజనం చేస్తున్న విద్యార్థులు

సందడిగా ఫుడ్ ఫెస్టివల్



సిద్దిపేట కల్చరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ సందడిగా సాగింది. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల పదార్థాలు తయారు చేసి ఆకట్టుకున్నారు. తయారు చేసిన వంటలను పాఠశాల ఆవరణలో ప్రదర్శించారు. పులిహోర, దద్దోజనం, మక్కగారెలు, పప్పు గారెలు, పకోడీ, మిర్చి, రవ్వ లడ్డులు, బూందీ లడ్డులు, సిరా లడ్డులు, బక్షాలు, పావుబాజీ, శాండ్విచ్, పుదీనా రైస్, చెకోడీలతో పాటు సుమారు 50 రకాల వంటలను చేసి ఆకట్టుకున్నారు. అనంతరం తోటి విద్యార్థులందరికీ వారు తయారుచేసిన వంటలను వడ్డించారు. భోజన అనంతరం ఆషాడ మాస సందర్భంగా గోరింటాకు ఉత్సవం నిర్వహించారు.

రోడ్డెక్కిన విద్యార్థులు, తల్లిదండ్రులు

- ఉపాధ్యాయుల డిప్యూటేషన్ రద్దు చేయాలంటూ నిరసన
- మీరేం చేసినా రద్దు చేసేది లేదు : డీఈవో

సిద్దిపేట రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): నారాయణరావుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదుట బైఠాయించి.. ఉపాధ్యాయుల డిప్యూటేషన్లు రద్దు చేయాలని గురువారం విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. వీరికి విద్యార్థుల తల్లిదండ్రులు, పలు విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. బడిబాట కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం కల్పించిన ఉపాధ్యాయులను అకారణంగా డిప్యూటేషన్‌పై పంపించడాన్ని వారు వ్యతిరేకించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ పాఠశాలలో గతంలో 142 మంది విద్యార్థులుండగా.. ఇప్పుడు ఆ సంఖ్య 193కు చేరిందన్నారు. పాఠశాలలో 15 మంది ఉపాధ్యాయులుండగా.. ముగ్గురు ఉపాధ్యాయులను తరలించడం వల్ల ఇక్కడి విద్యార్థులు ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఈ సందర్భంగా డీఈవో శ్రీనివాస్‌రెడ్డికి ఫోన్ చేసి వారి డిప్యూటేషన్ రద్దు చేయాలని కోరారు. ఇందుకు " ఏం బెదిరిస్తున్నారు.. పనిచేయకుండా కూర్చోబెట్టి వారికి జీతాలు ఇస్తున్నాం. జీవో ప్రకారమే వారిని డిప్యూటేషన్‌పై పంపించాం. మీరు ఏం చేసినా.. రద్దు చేసేది లేదు." అంటూ డీఈవో దురుసుగా స్పందించారు. ప్రైవేటు పాఠశాలలకు వత్తాసు పలుకుతున్నారంటూ.. డీఈవో తీరుపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని వారు హెచ్చరించారు.


తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు

బీఆర్ఎస్ నాయకుడికి బెదిరింపు కాల్స్

● పోలీసులకు రంజిత్‌నాయక్ ఫిర్యాదు

హవేళిఘణపూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని స్కూల్‌తండాకు చెందిన బీఆర్ఎస్ గిరిజన నాయకుడు రంజిత్‌నాయక్ తనకు ఎమ్మెల్యే రోహిత్‌రావు అనుచరుల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అనుచరుడు మెదక్ పట్టణానికి చెందిన షైసన్ బిన్ అబ్దుల్లా రాత్రి 11 గంటలకు వాట్సాప్ కాల్ చేసి కులం పేరుతో దూషించడమే కాకుండా చంపేస్తానని, సోషల్ మీడియాలో బీఆర్ఎస్‌కు సంబంధించిన ఎలాంటి ఫొటోలు, వీడియోలు పెట్టొద్దని బెదిరించాడని, అతడి వల్ల తనకు ప్రాణహాని ఉన్నదని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట శ్రీనునాయక్, ఫుల్‌సింగ్, తరుణ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలి

● సంగారెడ్డి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకటలక్ష్మి

కంది, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలని సంగారెడ్డి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడు(ఏడీఏ) వెంకటలక్ష్మి అన్నారు. గురువారం కందిలోని పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం)ను మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌తో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. పీఏసీఎస్‌లో ఉన్న యూరియా స్టాక్, విత్తనాలను ఆమె పరిశీలించారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు యూరియా, విత్తనాలు కొరత లేకుండా చూడాలని చైర్మన్ దొడ్ల ప్రభాకర్‌రెడ్డి, సీఈవో మందాడ శ్రీధర్‌రెడ్డికి సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రాణాలో కారుతో ఢీ

● భూ వివాదంతో వైరం.. ప్రాణభయంతో పరుగుపెట్టిన వ్యక్తి
● వెంబడించి మరీ ఘాతుకం


పోలీస్‌స్టేషన్‌లో కారు

కొమురవెల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వారిద్దరి మధ్య కొంతకాలంగా భూ వివాదం నడుస్తోంది. గురువారం ఓ వైన్స్ పర్మిట్ రూంలో మద్యం తాగుతుండగా, ప్రత్యర్థి వచ్చి కర్రలతో దాడి చేశాడు. అతను ప్రాణభయంతో పరుగున పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా, కారులో వెంబడించి ఢీ కొట్టాడు. ఈ ఘటన మండలకేంద్రంలో పోలీస్ స్టేషన్ సమీపంలో గురువారం జరిగింది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అయినపూర్ గ్రామానికి చెందిన ఆలేటి రాంరెడ్డికి అదే గ్రామానికి చెందిన నాయిని ప్రతాప్‌రెడ్డికి కొంత కాలంగా భూ తగాదాలు నడుస్తున్నాయి. ఆలేటి రాంరెడ్డి గురువారం పోలీస్‌స్టేషన్‌కు సమీపంలోని ఓ వైన్స్ పర్మిట్ రూంలో మద్యం తాగుతున్నాడు. నాయిని ప్రతాప్‌రెడ్డితో పాటు మరొకరు అక్కడికి వచ్చి రాంరెడ్డిపై కర్రలతో దాడిచేశారు. ప్రాణభయంతో రాంరెడ్డి దగ్గరలోనే ఉన్న పోలీస్‌స్టేషన్‌కు పరుగులు తీయగా, ప్రతాప్‌రెడ్డి కారులో వెంబడించి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న రాంరెడ్డిని ఢీ కొట్టాడు. అక్కడే ఉన్న కానిస్టేబుల్ అడ్డుకునే ప్రయత్నం చేయగా, తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. రాంరెడ్డికి గాయాలు అయ్యాయి. పోలీసులు వచ్చి కారుతో ఢీకొన్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై ఎస్సై రాజు గౌడ్‌ను సంప్రదించగా, ఇద్దరూ మద్యం మత్తులో ఉన్నారని, కారుతో ఢీ కొట్టిన వ్యక్తిని అదుపులో తీసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం తగదు

సంగారెడ్డి రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలు, గిరిజన తండాల్లో అభివృద్ధి పనులపై నిర్లక్ష్యం వహించడం తగదని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు బానోత్ హుస్సేన్ అధికారులను హెచ్చరించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో గురువారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలు, గిరిజనతండాల్లో అభివృద్ధి పనులు చేపట్టాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. గిరిజనతండాల్లో మౌలిక వసతుల కల్పనకు అధికారులు కృషి చేయాలని సూచించారు. జాతీయ ఎస్సీ కమిషన్ వచ్చినప్పుడు అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. గిరిజన బిడ్డలకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలపై అవగాహన కల్పించాలని సూచించారు. తండాలకు తాగునీటి వసతితో పాటు రోడ్ల సౌకర్యాల కల్పనకు అధికారులు ముందు దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. గిరిజనులు ఎన్నో సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు అందించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో కలెక్టర్ ప్రావీణ్య, జిల్లా గిరిజన సంక్షేమాధికారి అఖిలేష్‌రెడ్డి, డీఆర్డీఏ పీడీ జ్యోతి, జిల్లా సంక్షేమాధికారి లలితకుమారి, జడ్పీ సీఈవో జానకీరెడ్డి, బీసీ సంక్షేమాధికారి రామాచారి, డీఎంహెచ్‌వో డా.గాయత్రి, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి వసంతకుమారి, సర్వే ల్యాండ్ రికార్డు ఏడీ అధికారి దినేష్, అదనపు డీఆర్డీవో బాల్‌రాజ్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

బెట్టింగ్ యాప్‌లో డబ్బు పోయినందుకే.. బీటెక్ విద్యార్థి ఆత్మహత్య


అజ్మీరా తరుణ్ (ఫైల్)

నర్సాపూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు రూ. 40 వేలు పంపించారు. అవి కాస్త బెట్టింగ్ యాప్‌లలో పోగొట్టుకున్నాడు. తల్లిదండ్రులకు ఏం సమాధానం చెప్పాలో అన్న వేదనో ఏమోగాని బీటెక్ చదువుతున్న విద్యార్థి తాను ఉండే ప్రైవేట్ హాస్టల్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో బీటెక్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న కారణాలను పోలీసులు కనుగొన్నారు. ఎస్సై లింగం కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం పుత్లూర్ గ్రామానికి చెందిన అజ్మీర తరుణ్(18) నర్సాపూర్ సమీపంలోని ఓ కళాశాలలో బీటెక్ సెంకండీయర్ చదువుతూ, నర్సాపూర్‌లోని ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్నాడు. 20 రోజుల క్రితం తల్లిదండ్రులు చదువు, ఇతర ఖర్చుల కోసం రూ. 40వేలు పంపించారు. అవి బెట్టింగ్ యాప్‌లో పెట్టి పోగొట్టుకున్నాడు. దీంతో మనస్తాపం చెంది బుధవారం హాస్టల్ గదిలో ఉరి వేసుకున్నాడు. అతని సోదరుడు ఉదయ్‌కిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నా భూమిని కబ్జా చేస్తున్నారు

● ఉన్నతాధికారులకు భూ యజమాని ఫిర్యాదు

పటాన్‌చెరు రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): భూవివాదంలో బీడీఎల్ ఎస్‌హెచ్‌వో ఓ వర్గానికి మద్దతు పలుకుతున్నాడని భూయజమాని నల్లగుండ్ల నర్సింగ్‌గౌడ్ ఆరోపించారు. ఈ మేరకు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాటిలోని తన ప్లాట్‌ను కొందరు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని, ఈ విషయంలో ఏడీ సర్వే కూడా తమకు అనుకూలంగా ఉందని అన్నారు. అయినా, ఎస్‌హెచ్‌వో ప్రత్యర్థులకు సహకరిస్తున్నారని ఆరోపించారు. దీనిపైన ఉన్నతాధికారులు పూర్తి విచారణ చేసి తమకు న్యాయం చేయాలని బాధితుడు కోరాడు. ఈ విషయమై బీడీఎల్ సీఐ స్వామిగౌడ్ మాట్లాడుతూ సివిల్ విషయాలు కోర్టులో తేల్చుకోవాలని చెప్పామని, ఇరువర్గాల మధ్య గొడవ జరిగిన నేపథ్యంలో కేసులు నమోదు చేశామన్నారు.

బాలికపై వృద్ధుడి లైంగిక వేధింపులు

● నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించిన పోక్సో కోర్టు

గుమ్మడిదల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఎనిమిదేళ్ల బాలిక ఇంట్లో ఉండగా, వృద్ధుడు చాకెట్లు ఇప్పిస్తానని ఆశపెట్టాడు. ఏమీ తెలియని ఆ బాలిక అతడి వెంట వెళ్లిన ఆమెపై లైంగిక వేధిపులకు పాల్పడ్డాడు. ఈ కేసులో పదేళ్ల తర్వాత నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 5 వేల జరిమానా విధిస్తూ సంగారెడ్డి స్పెషల్ పోక్సో కోర్టు జడ్జి జయంతి గురువారం తీర్పు వెలువరించారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం ఎస్సై భరత్ భూషణ్ వివరించారు. జిన్నారం పోలీస్‌స్టేషన్ పరిధిలో గుమ్మడిదల మండలంలో ఓ గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల బాలిక ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో వారి ఇంటి పక్కనే ఉండే కేల్లా సూర్యారావు చాకెట్లు ఇప్పిస్తానని ఆశపెట్టి తీసుకెళ్లి, లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ మేరకు జిన్నారం పోలీసులకు ఫిర్యాదు అందగా, అప్పటి ఎస్‌హెచ్‌వో లాలూనాయక్ కేసు దర్యాప్తు చేశారు. న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేయగా, పదేళ్ల తర్వాత గురువారం కోర్టు నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 5 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. ఘటన జరిగిన సమయంలో నిందితుడి వయస్సు 55 ఏళ్లు కాగా, ఇప్పుడతని వయస్సు 65. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ నూర్‌రెడ్డి, విచారణాధికారి లాలూనాయక్, ప్రస్తుత ఎస్సై భరత్‌భూషన్, కోర్ట్ లైజనింఘ్ అధికారి, హెడ్‌కానిస్టేబుల్ శంకర్, కె. సత్యనారాయణలను సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ అభినందించారు.

తెగి పడిన విద్యుత్ తీగ.. తప్పిన ప్రమాదం


ట్రాన్స్‌కో అల్లాదుర్గం లైన్‌మెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు

అల్లాదుర్గం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ తీగ తెగిపడి తృటిలో ప్రమాదం తప్పిన ఘటన పట్టణంలోని పాత పోలీస్‌స్టేషన్ వద్ద గురువారం జరిగింది. పాత పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఉన్న తీగ గురవారం తెగి పడింది. ఆ సమయంలో అటుగా ఇద్దరు వెళ్తుండగా, గమనించి పక్కకు జరగడంతో ప్రమాదం తప్పింది. దీంతో స్థానికులు కరెంట్ సరఫరా నిలిపివేసి స్థానిక లైన్‌మన్‌కు సమాచారం ఇచ్చారు. అతను రెండు గంటల అనంతరం రావడంతో అక్కడి వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజులుగా తాగునీటి సరఫరా లేకపోవడంతో, ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.

కల్లు దుకాణంలో ఇద్దరు ఘర్షణ

● కల్లు సీసాతో ఒకరిపై దాడి, పరిస్థితి విషమం

నర్సాపూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : కల్లు దుకాణంలో ఇద్దరి మధ్య ఘర్షణ జరగ్గా.. కల్లు సీసాతో ఒకరు మరొకరిపై దాడిచేశారు. ఎస్ఐ లింగం వివరాల ప్రకారం.. నర్సాపూర్ మండలం కాగజ్‌మద్దూర్‌కు చెందిన వడ్ల నిరంజన్ బుధవారం సాయంత్రం కల్లు దుకాణంలో కల్లు సేవించడానికి వెళ్లాడు. అక్కడ అదే గ్రామానికి చెందిన వడ్ల శివ కనిపించగా.. నిరంజన్ తనకు శివ ఇవ్వాల్సిన డబ్బుల గురించి అడిగాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుని, ఒకరిపై ఒకరు దాడిచేసుకునే వరకూ వెళ్లింది. ఈ క్రమంలో శివ తన పక్కనే ఉన్న కల్లుసీసా తీసుకుని నిరంజన్‌పై దాడిచేశాడు. పక్కన ఉన్న వారు గమనించి ఇద్దరినీ విడిపించారు. తీవ్ర గాయాలపాలైన నిరంజన్‌ను నర్సాపూర్ ఆస్పత్రికి, అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. బాధితుడి తండ్రి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నలుగురు గంజాయి నేరస్థుల బైండోవర్

సిద్దిపేట క్రైం, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : గంజాయి రవాణా కేసులో నిందితులైన నలుగురిని గురువారం ఎమ్మార్వో ఎదుట బైండోవర్ చేశారు. రూరల్ మండల పరిధికి చెందిన కాల్వ వెంకటేశ్, గట్టు వినీల్, పర్కపల్లి రామచంద్రం, కొండూరు అరవింద్ గంజాయి కేసుల్లో నిందితులు. వీరికి రూ.2 లక్షల జరిమానాతో బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

నాలుగు టిప్పర్లు సీజ్

జోగిపేట రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న నాలుగు టిప్పర్లను ఎస్ఐ పాండు సీజ్‌చేశారు. జోగిపేట బైపాస్ రోడ్డు సమీపంలో ఏర్పాటు చేస్తున్న వెంచర్‌లో కోకాపేటకు చెందిన నాలుగు టిప్పర్లు అక్రమంగా మట్టిని తరలిస్తున్నాయనే విషయం తెలిసి ఘటనా స్థలానికి చేరుకుని సీజ్ చేశామన్నారు. అనంతరం వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని ఎస్ఐ పాండు తెలిపారు.

క్రైం కార్నర్

అయ్యో కనకమ్మ..

● కూలీకి వెళ్తూ కానరాని లోకాలకు..
● గురువన్నపేట వద్ద ఆటో బోల్తా, మహిళ మృతి



బోల్తా పడటంతో ధ్వంసమైన ఆటో, కనకమ్మ(ఫైల్)

జగదేవ్‌పూర్/కొమురవెల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : అందరితో కలిసి ఉండే కనకమ్మను ఆటో రూపంలో మృత్యువు కబళించింది. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలంలోని చాట్లపల్లి గ్రామానికి చెందిన 15 మంది కూలీలు గురువారం ఆటోలో కొమురవెల్లి మండలం గురువన్నపేటలో నాటు వేసేందుకు బయలుదేరారు. గురువన్నపేట చౌరస్తాకు వెళ్లగానే ఆటోకు కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి బోల్తాపడింది. ముందు భాగంలో డ్రైవర్ పక్కన కూర్చున్న కనకమ్మ కిందపడగా ఆమెపై ఆటో పడింది. దీంతో కనకమ్మ తలకు తీవ్రగాయాలు కాగా.. వెంటనే గజ్వేల్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మరో నలుగురికి గాయాలైనట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామంలో అందరితో కలిసి ఉండే కనకమ్మ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో చేగుంట వాసి మృతి


రాములు(ఫైల్)

చేగుంట, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : మేడ్చల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో చేగుంట వాసి మృతిచెందాడు. చేగుంట గ్రామానికి చెందిన మ్యాకల రాములు(55) విద్యుత్ మీటర్ల రీడింగ్ మిషన్లు సంబంధించి హైదరాబాద్‌లో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. రోజు మాదిరిగానే హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో ఓ ట్యాంకర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. రాములు మృతితో చేగుంట మండల కేంద్రంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

సిగాచీ పరిశ్రమలో గాయపడ్డ మరో కార్మికుడు మృతి

● 46కు చేరిన మృతుల సంఖ్య

పటాన్‌చెరు రూరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలోని సిగాచీ పరిశ్రమ ప్రమాదంలో గాయపడ్డ మరో కార్మికుడు గురువారం మృతి చెందాడు. ప్రమాదంలో గాయపడి యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన దయాకర్ బసక్ అనే కార్మికుడు మృతి చెందాడు. దీంతో ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 46కు చేరింది. ఇంకా పలువురు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండగా, వారి పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉంది. ప్రమాదం జరిగిన రోజు నుంచి కనబడని ఇంకో ఎనిమిది మంది ఆచూకీ ఇప్పటి వరకు తెలియలేదు.

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య

పేట్‌బషీరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపులు తాళలేక గృహిణి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన నగరంలోని పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై సుందరయ్య కథనం ప్రకారం.. మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండలం, కప్పంపల్లి గ్రామానికి చెందిన పూసల నాగరాజు, జ్యోతి(35)కి 2018లో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులు. బతుకుదెరువు కోసం మూడేళ్ల క్రితం నగరానికి వచ్చి దూలపల్లిలోని అయ్యప్ప 60 గజాల్లో అద్దె ఇంట్లో ఉంటున్నారు. నాగరాజు ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా, భార్య జ్యోతి ఇంట్లో ఉంటుంది. కొంత కాలంగా భార్య ప్రవర్తనపై అనుమానం, కట్నం డబ్బులు తీసుకురావాలని జ్యోతిని వేధించేవాడు. బుధవారం సాయంత్రం నాగరాజు పిల్లలను తీసుకు రావడానికి స్కూల్‌కు వెళ్లాడు. మనస్తాపానికి గురైన భార్య జ్యోతి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. నాగరాజు ఇంటికి వచ్చి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. స్థానికుల సహాయంతో కిందికి దింపి చూడగా అప్పటికే మృతిచెందింది. మృతురాలు కుటుంబసభ్యులు ఈ మేరకు గురువారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సుందరయ్య తెలిపారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు మహిళలు అదృశ్యం

హవేళిఘణపూర్/కొండపాక, జూలై 17 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు చోట్ల ఇద్దరు మహిళలు అదృశ్యమయ్యారు. భర్త తిట్టాడని ఒకరు, ఆస్పత్రికి వెళ్తున్నానని మరొకరు కనిపించకుండా పోయారు. హవేళిఘణపూర్ మండలంలోని శాలిపేట గ్రామానికి చెందిన పచ్చంటి లక్ష్మిని భర్త ప్రసాద్ తిట్టాడు. దీంతో ఆమె మంగళవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయింది. గ్రామంలో, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో భర్త గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712657921 నంబర్‌కు తెలియజేయాలని సూచించారు. కొండపాక మండలం సిరిసినగండ్ల గ్రామానికి చెందిన సంతోష్‌కుమార్ డ్రైవర్. ఈ నెల 15న ఆయన సిద్దిపేటలో ఉండగా, అతని భార్య దివ్య ఆస్పత్రిలో చూపించుకుంటానని భర్తకు ఫోన్ చేసింది. ఆటోలో రావాలని సూచించగా, వస్తున్నట్లు చెప్పింది. కుమార్తె కోమలిని తీసుకుని వెళ్లిన దివ్య సిద్దిపేటకు కానీ, ఇంటికి గాని రాలేదు. దీంతో టీహెచ్ఆర్ నగర్‌లోని ఆమె తల్లిగారింటి వద్ద, పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భర్త త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

దివ్యాంగ డ్రైవర్‌కు తప్పిన ప్రమాదం


దివ్యాంగ డ్రైవర్‌ను ఆటో నుంచి దింపుతున్న కార్మికులు

శివ్వంపేట, జూలై 17(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయి.. బతుకుదెరువు కోసం ఆటో నడిపించుకుంటున్న ఓ దివ్యాంగుడు మరోసారి ప్రమాదం బారిన పడ్డాడు. మండలంలోని బిజిలీపూర్‌లో గురువారం జరిగిన ఈ ఘటన వివరాలు.. ఓ గిరిజన యువకుడికి గతంలో రోడ్డు ప్రమాదం జరగగా, కుడికాలు కోల్పోయాడు. ఆ తర్వాత ఆటో నడిపించుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం బిజిలీపూర్ శివారులోని ఓ పరిశ్రమకు శివ్వంపేట నుంచి రెండు డ్రమ్ముల డీజిల్ లోడ్ చేసుకుని వెళ్లాడు. పరిశ్రమ వద్దకు వెళ్లగానే అక్కడ ఎత్తుగా ఉండటంలో ఆటో వెనుకకు లేచింది. అక్కడే ఉన్న పరిశ్రమ కార్మికులు వచ్చి ఆటోను పట్టుకున్నారు. దివ్యాంగ డ్రైవర్‌ను బయటికి తీశారు. దీంతో ప్రమాదం తప్పింది.

రూ.20కే రూ.2లక్షల బీమా

- ఉపాధి కూలీలకు పీఎంఎస్‌బీవై ఆర్థిక భద్రత
- ఈ నెలాఖరు వరకు గడువు
- 18-70 ఏళ్ల వయస్సుగల కూలీలు అర్హులు

కొండపాక, జూలై 17(ఆంధ్రజ్యోతి): నిరుపేద కుటుంబాలకు చెందిన వారికి ఉపాధి కల్పించాలని కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం ఎంతోమంది నిరుపేదలకు అండగా నిలుస్తుంది. పనిచేస్తున్న ప్రాంతంలో ఏదైనా ప్రమాదం జరిగితే వారిని ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించాలని నిర్ణయించింది. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనలో చేరితే బీమా ప్రయోజనం బాధితులు పొందనున్నారు. ఈ విషయాలను గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, పథకం ఇతర సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఈ పథకంలో చేరిన వారికి మరణించినా, పూర్తిగా అంగవైకల్యం కలిగినా రెండు లక్షల పరిహారం చెల్లిస్తారు. ఒకవేళ పాక్షికంగా అంగవైకల్యం కలిగితే లక్ష రూపాయలు పరిహారం అందిస్తారు. కొండపాక మండలంలో సుమారు 6వేల మంది ఉపాధి హామీ కూలీలు ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఈజీఎస్ సిబ్బంది

ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనలో చేరడం కోసం ఈ నెల 31 వరకు గడువు విధించారు. ప్రత్యేక ఫారంలో కూలీల వివరాలన్నింటినీ నమోదు చేసి ఇవ్వాల్సి ఉంటుంది. అందుకోసం ఈజీఎస్ సిబ్బంది కూలీలకు అవగాహన కల్పిస్తున్నారు.బీమా పథకంలో చేరడానికి 18 నుంచి 70 ఏళ్లలోపు వారు అర్హులు. బ్యాంక్ ఖాతాకు ఆధార్ కార్డు అనుసంధానమై ఉండాలి. బ్యాంకు ఖాతా ఉన్నచోట కూలీలు తమ పేర్లను నమోదు చేయించుకోవాలి. కూలీలు బీమా పథకంలో తమ పేర్లు నమోదు చేయించాక ఏటా ఖాతా నుంచి రూ.20 బీమాకు జమచేయాలని రాత పూర్వకంగా ఇవ్వాల్సి ఉంటుంది.



కూలీలకు ప్రయోజనం

ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనతో ఉపాధి హామీ కూలీలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ప్రమాదం సంభవిస్తే బీమా అండగా ఉంటుంది. అందరూ సద్వినియోగం చేసుకునేలా ఈజీఎస్ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు.

-ఎంపీడీవో వెంకటేశ్వర్లు



మెదక్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

మీడియా జోలికి వస్తే ఊరుకోం

- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

మెదక్ అర్బన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): మీడియాపై దాడులను సహించేది లేదని, మరోసారి మీడియా జోలికి వస్తే.. బీఆర్ఎస్‌కు చెందిన టీన్యూస్, నమస్తే తెలంగాణపై దాడులు చేస్తామని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నేత మైనంపల్లి హన్మంతరావు హెచ్చరించారు. గురువారం మెదక్ పట్టణంలో ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. డబ్బులు ఇచ్చి యూట్యూబ్‌లలో తప్పుడు ప్రచారాలు చేయిస్తున్న బావ, బావమరుదులకు చుక్కలు చూపిస్తామని హన్మంతరావు ఘాటు వ్యాఖ్యలు చేశారు. మేము ప్రజల్లో ఉండి వారి కష్టసుఖాలు తెలుసుకుంటే బీఆర్ఎస్ నేతలు ఇళ్లలో కూర్చుని యూట్యూబ్ ఛానెళ్లకు డబ్బులు ఇచ్చి అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ దుకాణం బంద్ అయిందని, ఆ పార్టీకి చెందిన నేతలు భారీగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు. బీఆర్ఎస్‌కు ప్రజల్లో ఆదరణ తగ్గిందన్న భయంతో ప్రాంతం, కులం, మతం అని సెంటిమెంట్ రాజకీయాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఎలాంటి కుట్రలు చేసినా కేటీఆర్, హరీశ్‌రావులతో వారి కుటుంబానికి చుక్కలు చూపిస్తామన్నారు.



బాలికను కౌన్సెలింగ్ ఇస్తున్న ఎంఈవో శ్రీనివాస్

కూలి పనులకు బాలిక.. అడ్డుకున్న ఎంఈవో

- కేజీబీవీలో చేర్పిస్తామని హామీ

కల్హేర్/సిర్గాపూర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): సిర్గాపూర్ మండల పరిధిలోని జంలా తండా గ్రామ పంచాయతీ తోల్యా తండాకు చెందిన బాలిక కూలి పనులకు వెళ్తుండగా సిర్గాపూర్ ఎంఈవో నాగారం శ్రీనివాస్ అడ్డుకుని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రాథోడ్ శివరామ్, కవిత దంపతుల కూతురు చిట్టిబాయి 5వ తరగతి వరకు చదివి మధ్యలోనే చదువు మానేసి తల్లిదండ్రులకు తోడుగా కూలీ పనులకు వెళ్తుంది. గురువారం కూడా వెళ్తుండగా ఎంఈవో బాలికను గమనించి అడ్డుకున్నారు. పాఠశాలకు వెళ్లే వయస్సులో కూలీ పనులు చేయించడం నేరమని ఆమె తల్లిదండ్రులకు చెప్పారు. సిర్గాపూర్ కేజీబీవీలో బాలికను చేర్పించి విద్యాభ్యాసం చేయిస్తామని తెలుపడంతో దానికి బాలిక చిట్టిబాయి తల్లిదండ్రులు సమ్మతించారు. ఆయన వెంట సీఆర్పీ శివకుమార్ ఉన్నారు.

మోసపూరిత హామీలతో అధికారంలోకి కాంగ్రెస్

- ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య



సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దివ్యాంగులు

సంగారెడ్డి రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య అన్నారు. గురువారం సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట దివ్యాంగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే దివ్యాంగులకు పెన్షన్ రూ.6 వేలకు పెంచుతామని చెప్పిన కాంగ్రెస్.. తీరా అధికారంలోకి వచ్చాక విస్మరించిందన్నారు. పెన్షన్ పెంపు కోసం 42 లక్షల మంది ఎదురుచూస్తున్నారని, ఇచ్చిన మాట ప్రకారం దివ్యాంగులకు పెన్షన్ పెంచాలని లేని పక్షంలో సరైన రీతిలో గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బస్వరాజ్, నర్సింహులు, ఉపాధ్యక్షులు జయలక్ష్మి, రాంచందర్, రాజ్‌కుమార్, రాములు, సభ్యులు శంకర్‌నాయక్, కృపవరం, లక్ష్మణ్, శివకుమార్, సుమలత, సయ్యద్, నరేష్, రాజశేఖర్, మెగులయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజన వసతి గృహంలో సౌకర్యాలు కల్పించాలి

- ఆడిటింగ్ అధికారి శ్రీనివాస్ చారి



చిన్నశంకరంపేట గిరిజన బాలుర వసతి గృహంలో ఆడిట్ నిర్వహిస్తున్న అధికారి శ్రీనివాస్ చారి

చిన్నశంకరంపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): గిరిజన వసతి గృహంలో అవసరమైన అన్నీ సౌకర్యాలు కల్పించాలని స్టేట్ ఆడిటింగ్ అధికారి శ్రీనివాస్ చారి అన్నారు. గురువారం చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని గిరిజన బాలుర వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. 2018 నుంచి 2025 వరకు వసతి గృహానికి సంబంధించిన నిధులు ఉపయోగించిన అంశాలపై రికార్డులను ఆడిట్ చేశారు. వసతి గృహానికి మరమ్మతులకు ఖర్చు చేసిన అంశాలపై హాస్టల్ వార్డెన్‌ను ఆరాతీశారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. ఆడిట్ చేసిన వివరాల నివేదికను అధికారులకు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పలు గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటన

పాపన్నపేట, జూలై 17(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో స్వచ్ఛతను పర్యవేక్షించేందుకు స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ కేంద్ర బృందం సభ్యులు సుమలత, రాణి, ఇలియాస్‌లు గురువారం మండల పరిధిలోని కొడుపాక, చిత్రియాల గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, మరుగు దొడ్ల వినియోగం, పారిశుధ్య నిర్వహణ, డంపింగ్ యార్డు, ఇంకుడు గుంతలు తదితర వాటిని పరిశీలించారు. పథకాల అమలు గురించి ప్రజలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. శుక్రవారం మిన్‌పూర్, అర్కెల గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరించనున్నారు. ఎంపీడీవో విష్ణువర్ధన్, ఇన్‌చార్జి ఎంపీవో పరమేశ్వర్, పంచాయతీ కార్యదర్శులు బాబునాయక్, జగదీశ్ ఉన్నారు.



కొడుపాకలో డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ కీలకమైనది

- ఉమ్మడి జిల్లా ఇంటర్మీడియట్ విద్య ప్రత్యేకాధికారి కిషన్

జోగిపేట, జూలై 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ ఎంతో కీలకమైనదని, , విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తీర్ణులు కావాలని ఉమ్మడి జిల్లా ఇంటర్మీడియట్ విద్య ప్రత్యేకాధికారి కిషన్ అన్నారు. గురువారం ఆయన జోగిపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. ఇంటర్మీడియట్ దశలో తీసుకున్న నిర్ణయాలే తమ జీవితాలను మలుపుతిప్పుతాయని గుర్తుంచుకోవాలన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందన్నారు. ఈ కళాశాలలో చేరిన విద్యార్థులను అభినందించారు. కళాశాలలో 280 అడ్మిషన్లు కావడంపై హర్షం వ్యక్తం చేసి ప్రిన్సిపాల్ రజితతో పాటు, అధ్యాపకులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రజిత, అధ్యాపకులు శ్రీనివాస్, విఠల్, గోవర్ధన్ రెడ్డి, శ్రవణ్, నూనె శ్రీనివాస్, అనిత, కమలాకర్, ప్రవీణ్, బాలాజీ, రాజ్‌కుమార్, గౌస్, నర్సింహులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కళాశాలను సందర్శిస్తున్న కిషన్

రోడ్డు కబ్జాతో రైతులకు తీవ్ర ఇబ్బందులు

- కాపాడాలని తహసీల్దార్ వినతి

గుమ్మడిదల, జూలై 17(ఆంధ్రజ్యోతి): గుమ్మడిదల గ్రామంలోని రామ్‌నగర్ నుంచి ధర్మవరం వరకు వెళ్లే రోడ్డు ఓ రియల్ వ్యాపారి కబ్జా చేశారని రైతులు ఆరోపించారు. ఈ రోడ్డు రెవెన్యూ నక్షా ప్రకారం రికార్డుల్లో ఉందని, కానీ పాత రికార్డు ప్రకారం 800 ఎకరాల జాగీర్‌దార్ రామ్‌గోపాల్ రావు పొలంలో ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆ రోడ్డును కబ్జా చేసి గేట్ ఏర్పాటు చేసి సాగు చేసుకుంటున్నారని వివరించారు. దీంతో పంట పొలాలకు వెళ్లే రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోతున్నారు. రోడ్డు కబ్జా చేయబడిన విషయం పట్ల చర్యలు తీసుకుని, రోడ్డు ఎవరికి చెందిందో విచారించి దానిని ప్రజలకు తిరిగి అందుబాటులోకి తేవాలని గురువారం రైతులు గుమ్మడిదల తహసీల్దార్ పరమేశంకు వినతిపత్రం అందజేశారు. లేదంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘాల సమైక్య ఉపాధ్యక్షులు మద్దుల బాల్ రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు సదాశివానందరెడ్డి, పలు రైతులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

అన్యాయానికి గురవుతున్న గిరిజనులు

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్



సభలో మాట్లాడుతున్న హుస్సేన్ నాయక్

కల్హేర్/సిర్గాపూర్, జూలై 17(ఆంధ్రజ్యోతి): సమైక్య రాష్ట్ర పాలనలో గిరిజనులు అన్యాయానికి గురయ్యారని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా అదే పరిస్థితి నెలకొన్నదని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ ఆరోపించారు. సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం వగ్ధల్ గైర్హాన గిరిజన తండాను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ గిరిజన తండాకు వాగుపై వంతెన నిర్మించకుండా సంవత్సరాల తరబడి తాత్సారం చేయడం బాధాకరమని అన్నారు. అభివృద్ధి పనులకు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదని ఆయన అన్నారు. తాను ప్రతి మూడు మాసాలకొకసారి ఈ ప్రాంతానికి వస్తుంటానని, అప్పటి వరకు వంతెన నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, అడిషనల్ ఎస్పీ సంజీవరావ్, నారాయణఖేడ్ ఆర్డీవో అశోక్ చక్రవర్తి, గిరిజన నాయకులు ప్రకాష్ రాథోడ్, రవీందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



కంగ్టిలో గంగమ్మకు పూజలు చేస్తున్న ప్రజలు

వర్షాల కోసం పూజలు

నంగునూరు/కొల్చారం/కంగ్టి, జూలై 17(ఆంధ్రజ్యోతి): వరుణుడి కరుణ కోసం దేవుణ్ణి వేడుకుంటూ, వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ పలు గ్రామాల్లో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. నంగునూరు మండలం గట్లమల్యాల గ్రామంలోని దేవాలయాల్లో జలాభిషేకాలు నిర్వహించారు. కొల్చారం మండలం రాంపూర్ గ్రామస్థులు ఏడుపాయల ఘనపూర్ ఆనకట్టపై ఉన్న గంగమ్మతల్లికి పూజలు చేశారు. మండల కేంద్రమైన కంగ్టిలోని ఆంజనేయ స్వామి ఆలయంలో జలాభిషేకం నిర్వహించారు. స్వామివారి విగ్రహం పూర్తిగా నీటిలో మునిగే వరకు 1116 నిండు బిందెలతో నీళ్లు తెచ్చి గర్భగుడిని నింపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



నంగునూరు మండలం గట్ల మల్యాలలో వర్షాల కోసం పూజలు చేస్తున్న భక్తులు



రామాయంపేటలో వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు



నిజాంపేటలో మినీ ట్యాంకు నుంచి వృథాగా పోతున్న నీరు

నీటి వృథా.. తప్పదు వ్యథ

- నల్లాలను బంద్ చేయని వైనం
- డ్రైనేజీ పాలవుతున్న తాగునీరు

రామాయంపేట, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలు నీటిని అడ్డగోలుగా వాడుతున్నారు. వానలు సరిగా లేక భూగర్భ జలాలు గణనీయంగా పడిపోతున్నాయి. ఈ నేపథ్యంలో నీటిని పొదుపుగా వాడుకోవాల్సి ఉంది. కానీ ప్రజలు ఇదేం పట్టించుకోకుండా యథేచ్ఛగా నీటిని వృథా చేస్తున్నారు. మెదక్ జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామాల్లో నీటి ట్యాంకులు, మిషన్ భగీరథ నల్లాల నుంచి సరిపడా నీళ్లు పట్టుకున్నాక నల్లాలను బంద్ చేయకపోవడంతో నీరంతా గంటల తరబడి వృథాగా పోతున్నది. ఉచిత కరెంటు పథకాలు సైతం నీటి పొదుపునకు విఘాతం కలిగిస్తున్నాయి. ఇళ్లలో మోటార్లు ఆపకుండా, వ్యవసాయ బోర్లు ఆన్ చేసి వదిలేయడం వల్ల నీరు వృథా అవుతోంది. దీంతో కొన్ని ప్రాంతాల్లో వానకాలంలోనూ నీటి సమస్య తలెత్తుతున్నది. దీనిపై మిషన్ భగీరథ ఈఈ సంపత్ కుమార్ వివరణ కోరగా తాగునీటి వృథా నివారణకు నల్లాలకు చెర్రాలు బిగిస్తున్నామని తెలిపారు. నీటి వృథా కట్టడికి ప్రజలు సహకరించాలని కోరారు.

సిగాచి పరిశ్రమ ఘటన బాధ్యులపై చర్యలేవి? : సీఐటీయూ

పటాన్‌చెరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): సిగాచి పరిశ్రమ పేలుడులో భారీ ప్రాణ నష్టం జరిగినా బాధ్యులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని సీఐటీయూ నాయకులు ప్రశ్నించారు. గురువారం పటాన్‌చెరు శ్రామిక భవన్‌లో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు పాండురంగారెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు మానిక్ తదితరులు మాట్లాడుతూ పరిశ్రమ యాజమాన్యం కనీస భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతోనే ప్రమాదం జరిగిందన్నారు. అయినా యాజమాన్యంపై, భద్రతా ప్రమాణాలను తనిఖీ చేయకుండా పరోక్షంగా బాధ్యులైన అధికారులపైన ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. రూ.కోటి నష్టపరిహారం ఇంతవరకు బాధిత కుటుంబాలకు అందలేదన్నారు. తక్షణమే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ సమావేశంలో పలు యూనియన్ల నాయకులు శంతన్‌కుమార్, రామకృష్ణ, రాజు, వెంకటేశ్, శ్రీకాంత్‌గౌడ్, జయరాం, రోషన్, మహేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయ సహాయం అందిస్తాం

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య

జహీరాబాద్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా బాధితులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య పేర్కొన్నారు. గురువారం జహీరాబాద్ పట్టణంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలతో న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఇందులో భాగంగా వారికి పోక్సో, గృహహింస, వరకట్నం తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు సంబంధించిన కేసులను త్వరితగతిన పరిష్కరించే విధంగా కృషి చేయాలన్నారు. బాధితులు న్యాయ సహాయం కోరితే వారికి ఉచితంగా సలహాలు పొందుటకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సందర్శించి పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఐసీడీఎస్ అధికారి లలిత కుమారి, సీడీపీవో ఆంజమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

డ్రంకెన్ డ్రైవ్‌లో 12 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 12 మందికి జరిమానా విధించారు. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తన సిబ్బందితో కలిసి కొన్ని రోజుల నుంచి పట్టణంలో నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తా, రాజీవ్ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 12 మందిని పట్టుకున్నారు. వారిని గురువారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపరచగా వేర్వేరుగా రూ .24000 జరిమానా విధించారు.

ములుగు హార్టికల్చర్ వర్సిటీకి ఉత్తమ అవార్డు

ములుగు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ బొంబాయి నుంచి ఓపెన్ సోర్స్ ఆఫ్ట్‌వేర్ ఫర్ ఎడ్యుకేషన్ కేటగిరిలో శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉత్తమ విశ్వవిద్యాలయ అవార్డును దక్కించుకుంది. జియోస్పెషియల్, క్రియాశీల భాగస్వామ్యంపై అవగాహన కల్పించినందున ఉత్తమ విద్యాలయ అవార్డు వచ్చింది. ఈ అవార్డుని ముంబైలో జరిగిన కార్యక్రమంలో ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ మాజీ చైర్మన్ కిరణ్ కుమార్ చేతుల మీదుగా ఉపకులాపతి దండా రాజిరెడ్డి అందుకున్నారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ.. ఈ అవార్డు తమ బాధ్యతను మరింత పెంచిందన్నారు.

రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థిని



కీర్తనకు ప్రశంసాపత్రం అందజేస్తున్న మండల విద్యాధికారి వెంకటరాములు

మర్కుక్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామరకుంట ఉన్నతపాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో మెరవడం అభినందనీయమని ఎంఈవో వెంకటరాములు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వృథా నుంచి అద్భుతం అనే అంశంపై ఆన్‌లైన్‌లో నిర్వహించిన పోటీలలో దామరకుంట పాఠశాల పాల్గొంది. గురువారం వెలువడిన ఫలితాలలో ఈ పాఠశాల 8వ తరగతి విద్యార్థిని సాయెజీ కీర్తన ఎంపికైనట్లు ఎంఈవో తెలిపారు. పాఠశాలకు వెళ్లి ఈ విద్యార్థిని కీర్తనతోపాటు గైడ్ బ్రహ్మయ్యను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలిరెడ్డి, పీఆర్‌టీయూ మండల అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసరావు, కుమార్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గజ్వేల్ ఇన్‌స్పెక్టర్‌గా వి. రవికుమార్



సిద్దిపేట సీపీని కలిసిన ఇన్స్పెక్టర్ రవికుమార్

గజ్వేల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : గజ్వేల్ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్స్‌పెక్టర్‌గా వి. రవికుమార్ పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీ ఆయనను అభినందించి శాంతి భద్రతలకు పెద్దపీట వేయాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలన్నారు. గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తుపదార్థాలపై ప్రత్యే నిఘా ఏర్పాటు చేయ్యాలని సూచించారు. మత్తు రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని సూచించారు.

గొల్లకుర్మల అభివృద్ధికి నగదు బదిలీ చేయాలి

మద్దూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): గొర్లకుర్మల సంక్షేమానికి నగదు బదిలీ చేసి ఆదుకోవాలని గొర్రె, మేకల పెంపకందార్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆలేటి యాదగిరి డిమాండ్ చేశారు. గురువారం మద్దూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మహాసభకు హాజరై మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందన్నారు. అప్పులు చేసి డీడీలు కట్టిన వాళ్లకు వాపసు ఇచ్చి అన్యాయం చేశారని మండిపడ్డారు.

చురుగ్గా సబ్ స్టేషన్ పనులు

- మండల కేంద్రంపై తగ్గనున్న భారం
- నాణ్యమైన విద్యుత్ సరఫరాకు అవకాశం



గ్రామ శివారులో సబ్ స్టేషన్ నిర్మాణం పనులు

కొమురవెల్లి, జూలై17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టంపేట, లెనిన్‌నగర్ గ్రామాల్లో రెండు 33/కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు చురుకుగా సాగుతున్నాయి. కిష్టంపేట సబ్ స్టేషన్‌కు రూ.2.43 కోట్లు, లెనిన్‌నగర్ సబ్ స్టేషన్‌కు రూ2.13 కోట్లు మంజూరు చేశారు. ఈ రెండు సబ్ స్టేషన్ల నిర్మాణాలు పూర్తైతే పలు గ్రామాలకు, రైతుల వ్యవసాయ మోటార్లకు నాణ్యమైన విద్యుత్తు అందనున్నది. కిష్టంపేట సబ్‌స్టేషన్ పరిధిలో కొమురవెల్లి, కిష్టంపేట, గౌరాయపల్లి గ్రామాలకు అలాగే లెనిన్‌నగర్ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తైతే మర్రిముస్త్యాల, లెనిన్‌నగర్ గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ అందడంతో పాటు గుర్జకుంట, చిట్యాల సబ్‌స్టేషన్లపై భారం తగ్గుతుంది. కొమురవెల్లి మండల కేంద్రంలో ఉన్న సబ్‌స్టేషన్ నుండే మండలంలో ఉన్న చాలా గ్రామాలకు విద్యుత్ సరఫరా జరుగుతుండటంతో ఈ సబ్‌స్టేషన్‌పై భారం పెరిగి పలు సమస్యలు తలెత్తుతున్నాయి. ఒక్కోసారి లోవోల్టేజ్, హై వోల్టేజ్ సమస్యలు కుడా ఉత్పన్నమవుతున్నాయి.

> కొమురవెల్లి మండలంలోని కిష్టంపేట, లెనిన్‌నగర్ గ్రామాల్లో సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ఈ రెండు సబ్‌స్టేషన్ల నిర్మాణం పూర్తై అందుబాటులోకి వస్తే మండల కేంద్రంలో ఉన్న సబ్‌స్టేషన్‌పై భారం తగ్గుతుంది. ఈ రెండు సబ్‌స్టేషన్ల పరిధిలో పలు గ్రామాలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించవచ్చు. రెండు నెలల్లో ఈ సబ్‌స్టేషన్లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.
>
> -జె.మధు, ఏఈ, కొమురవెల్లి

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జగదేవ్‌పూర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బిల్డింగ్ అండ్ ఆదర్ కన్స్ట్రక్షన్ వర్కర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ డిమాండ్ చేశారు. గురువారం జగదేవ్‌పూర్ మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మికుల ప్రథమ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఉన్న వెల్ఫేర్ బోర్డు ద్వారా అందిస్తున్న బెన్‌ఫిట్‌లను పెంచి ఇవ్వాలని, 50 సంవత్సరాలు నిండిన ప్రతి కార్మికుడికి ప్రతి నెల 9వేల పెన్షన్ అందించాలన్నారు.

వడ్డెపల్లిలో బోనాల సందడి



వడ్డెపల్లిలో బోనాల ఊరేగింపు

రాయపోల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఆషాడమాసం సందర్భంగా రాయపోల్ మండలం వడ్డెపల్లిలో గురువారం రాత్రి బోనాల సందడి నెలకొంది. గ్రామంలోని మహిళలందరూ బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి పోచమ్మతల్లికి సమర్పించారు. బోనాల ఊరేగింపు ముందర పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

నానో టెక్నాలజీ ఎరువులతో రైతులకు మేలు



నానో టెక్నాలజీ ద్రవరూప ఎరువులపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో శేషశయన

వర్గల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): యూరియా, డీఏపీల బదులు నానో టెక్నాలజీతో తయారైన ద్రవరూప ఎరువులతో రైతులకు మేలు జరుగుతుందని మండల వ్యవసాయాధికారి శేషశయన పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని సీతారాంపల్లి, మైలారం గ్రామాలలో రైతులకు నానో యూరియా, నానో డీఏపీ వల్ల కలిగే ప్రయోజనాలపై ఇఫ్కో కంపెనీ ప్రతినిధులతో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎక్కువ ఎరువులు వేస్తే ఎక్కువ దిగుబడి వస్తుందనే అపోహతో రైతులు మోతాదుకు మించి ఎరువులను వాడుతూ అధికంగా పెట్టబడి పెడుతూ పెట్టుబడి భారాన్ని పెంచుకుంటున్నరన్నారు. అలా కాకుండా నానో టెక్నాలజీతో తయారు చేసిన ద్రవ రూప యూరియా, డీఏపీలను వాడటం వల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాన్ని పొందవచ్చని తెలిపారు. అనంతరం. నానో యూరియాను ఓ రైతు పత్తి చేనులో స్ప్రే చేసి క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు.

విశ్వకర్మలకు ఉచిత విద్యుత్ అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ నాయకులు

సిద్దిపేట కల్చరల్, జూలై17 (ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ వృత్తిని నమ్ముకుని జీవనం గడుపుతున్న వారి సంక్షేమం కోసం ప్రభుత్వం 24గంటల ఉచిత కరెంటు అందించాలని అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు రాచమల్ల పున్నమాచార్యులు డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విశ్వకర్మ దేవాలయ ప్రాంగణంలో పరిషత్ రాష్ట్ర స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు రాజేశం, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌తోపాటు పున్నమాచార్యులు పాల్గొని మాట్లాడారు. గతంలో 5 హెచ్‌పీ వరకే ఉన్న సబ్సిడీ విద్యుత్‌ను 25 హెచ్‌పీ విద్యుత్ వరకు పెంచడం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పథకం ప్రకారం విశ్వకర్మ వృత్తుల వారికి నాలుగు రూపాయలకే యూనిట్ విద్యుత్ లభిస్తుందన్నారు. అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ ఏర్పాటు చేసి పోరాటం చేస్తేనే ఇది సాధ్యమైందని గుర్తు చేశారు. విశ్వకర్మ వృత్తులు చేసుకుంటున్న వారిపై అధికారుల వేధింపులు ఎక్కువయ్యాయని.. వాటికి అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో విశ్వకర్మలంతా ఏకమై పోరాటం చేస్తామని హెచ్చరించారు.

ఆరోగ్య హుస్నాబాదే..



వర్షంలో తడవకుండా టాటిపత్రి కప్పుకున్న మహిళలు

(5వ పేజీ తరువాయి..)

ఇందిరా మహిళా శక్తి విజయోత్సవ సంబరాలను నిర్వహించారు. మహిళా సంఘాలకు రూ.28.95 కోట్ల వడ్డీలేని రుణాల చెక్కులను అందించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజ్, ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్, సిద్దిపేట, హన్మకొండ, కరీంనగర్ కలెక్టర్లు హైమావతి, స్నేహ శబరీష్, పమేలా సత్పతి, జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్, జిలా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, తిరుపతిరెడ్డి, ఏఎంసీ చైర్మెన్లు తదితరులున్నారు.

ప్లాస్టిక్‌నుదూరం చేసేందుకే : మంత్రి సురేఖ

అనారోగ్యాలకు కారణమవుతున్న ప్లాస్టిక్‌ను దూరం చేసేందుకే మంత్రి పొన్నం ప్రభాకర్ గ్రామాల్లో స్టీల్ బ్యాంకులు ఏర్పాటు చేస్తున్నారని దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. రేపటి నుంచి ప్లాస్టిక్‌ను ముట్టుకోబోమని మహిళలు ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. మహిళలకు ఉచిత బస్సు వల్ల దేవాదాయశాఖకు రూ.170 కోట్ల ఆదాయం చేకూరిందన్నారు.

లఘు చిత్రాన్ని చూసిన గవర్నర్

ప్లాస్టిక్ వల్ల జరిగే అనార్థాలపై వేదికపై ప్రదర్శించిన లఘు చిత్రాన్ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆసక్తిగా తిలకించారు. దాదాపు 10 నిమిషాల నిడివి గల ఈ చిత్రం సభకు వచ్చిన వారిని ఆలోచింపజేసింది. గవర్నర్ కార్యక్రమానికి రాక ముందు జోరు వర్షం కురువగా సభకు వచ్చిన జనం కుర్చీలు, టాటిపత్రులను కప్పుకున్నారు.

బస్సును ప్రారంభించిన గవర్నర్

కోహెడ నుంచి వేములవాడకు నూతన ఆర్టీసీ బస్సు ను గవర్నర్ జిష్ణుదేవ్ ప్రారంభించారు. అనంతరం వేదిక ప్రాంగణంలో మంత్రులతో కలసి మొక్కలు నాటారు.

కోహెడకు ఇద్దరు గవర్నర్ల రాక

కోహెడకు 1979లో శారద ముఖర్జీ అనే గవర్నర్ ప్రభుత్వ పాఠశాలలో అభ్యుదయ ప్రాథమికోన్నత పాఠశాలను ప్రారంభించేందుకు వచ్చారు. మళ్లీ నిన్న స్టీల్ బ్యాంకు పంపిణీ కార్యక్రమానికి వచ్చిన జిష్ణుదేవ్ వర్మ రెండవవారు.

వర్క్ అడ్జస్ట్‌మెంట్ పారదర్శకంగా జరగాలి

సిద్దిపేట కల్చరల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల వర్క్ అడ్జస్ట్‌మెంట్ అలాట్‌మెంట్ పారదర్శకంగా చేయాలని, వివిధ కారణాలతో రద్దు కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల ఉత్తర్వులను నిలిపివేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గాడిపల్లి తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ సిద్దిపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులకు, పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు వెంటనే ఆర్జిత సెలవులు మంజూరు చేయాలన్నారు. గత విద్యా సంవత్సరంలో విధులు నిర్వహించిన పాఠశాల స్కావెంజర్ పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేయాలని చెప్పారు.

పాఠశాలకు వంట సామగ్రి అందజేత

కుకునూరుపల్లి, జూలై 17 (ఆంధ్రజ్యోతి): చిన్న కిష్టాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కట్టెల పొయ్యి మీద వంట చేస్తున్నారు. గమనించిన గ్రామానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి పాఠశాలకు గ్యాస్ స్టవ్, సిలిండర్, వంట సామగ్రిని అందించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజుగౌడ్, చంద్రం, శ్రీనివాస్‌చారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండి అశోక్, ఉపాధ్యాయులు సుధారాణి, వెంకటేశం, రేఖ, ప్రశాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

షిరిడి సాయిబాబా దేవాలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు షూ, సాక్స్

మద్దూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాగిళ్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం శ్రీ షిరిడీ సాయిబాబా దేవాలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు షూ, సాక్స్, టై, బెల్టుల్ని ట్రస్టు చైర్మన్ తౌటి భూమయ్య అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం హరిప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి భూమయ్య మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చక్కటి విద్యాబోధన జరుగుతుందన్నారు. ఉపాధ్యాయుల కృషి ఎనలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వరదరాజు, హైకోర్టు అడ్వకేట్ రాజేష్, ప్రొఫెసర్ ఈటెల సమ్మన్న, విద్యావేత్త చంద్రమౌళి, అధ్యాపకులు పవన్, బీజేపీ రాష్ట్ర నాయకులు బొంగోని సురేష్, మాజీ హెచ్‌ఎం అంజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ. 900 కోట్ల సీఎం రిలీఫ్ ఫండ్

వర్గల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లాకు రూ. 900 కోట్ల సీఎం రిలీఫ్ ఫండ్ విడుదల అయ్యాయని గజ్వేల్ నియోజకవర్గం కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి పేర్కొన్నారు. గురువారం వర్గల్ మండల పరిధిలోని వర్గల్, సెంటూర్ గ్రామాలతో పాటు పలు గ్రామాల వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కునలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి అందుకు కావలసిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పేదలకు మెరుగైన వైద్యం అందించడానికి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర్ రాజనర్సింహా విప్లవాత్మక మార్పులు చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మోహన్, నాయకులు గోపాల్‌రెడ్డి, పోన్నాల నర్సారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

సాగునీటిని విడుదల చేయాలి

- బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాంరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాంరెడ్డి

తొగుట, జూలై 17(ఆంధ్రజ్యోతి): పంటలను కాపాడుకోవడానికి మల్లన్నసాగర్ నుంచి సాగునీటిని విడుదల చేయాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాంరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తొగుటలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పత్తి, మొక్కజొన్న, వరి పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల గోస పట్టదా అని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు మల్లారెడ్డి, కనకయ్య, రమేశ్, అరుణ్ కుమార్, శ్రీనివాస్, రాజిరెడ్డి, నరేందర్‌గౌడ్, యాదగిరి, అనిల్ తదితరులు పాల్గొన్నారు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగవంతం

దుబ్బాక, జూలై17 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లను వేగవంతంగా పూర్తిచేయాలని గృహనిర్మాణశాఖ పీడీ దామోదర్‌రావు అన్నారు. గురువారం దుబ్బాకలోని నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. దశలవారీగా బిల్లులను అందిస్తామన్నారు. ఆయన వెంటమున్సిపల్ కమీషనర్ రమేష్‌కుమార్, హౌజింగ్ ఏఈ జాహ్నవి, సిబ్బంది తదితరులున్నారు.

కాశీవిశ్వేశ్వరాలయం అభివృద్ధికి కృషి

దుబ్బాక, జూలై17 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక కాశీవిశ్వేశ్వరాలయం అభివృద్ధికి తనవంతుగా కృషిచేస్తానని కాంగ్రెస్‌పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి చెరుకుశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన దుబ్బాకలోని కాశీవిశ్వేశ్వరాలయం ముందు బోరుబావిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాశీవిశ్వేశ్వరాలయం అభివృద్ధికి తనవంతుగా కృషిచేస్తామన్నారు. ఆలయజీర్ణోద్ధరణకు సుమారు రూ. 50 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయ జీర్ణోద్ధరణ పనులు త్వరగా చేపట్టేలా ఒత్తిడి తెస్తామన్నారు. అనంతరం దుబ్బాక మండలంలోని పలుగ్రామాలల్లో ఆయన పర్యటించి, పలువురు బాధితులను పరామర్శించారు.

బంద్‌ను విజయవంతం చేయాలి

చేర్యాల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 25న జేఏసీ ఆధ్వర్యంలో తలపెట్టిన బంద్‌ను విజయవంతం చేయాలని జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ కోరారు. గురువారం చేర్యాల మండల కేంద్రంలోని జేఏసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మద్దూరు, కొమురవెల్లి, దూళిమిట్ట, చేర్యాల మండలాల్లో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యాపార వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా పాల్గొని సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు అందె అశోక్, అందె బీరయ్య, జర్నలిస్టు పెండ్యాల రాజు, కర్రె నర్సిరెడ్డి బింగి రాజు, తదితరులు పాల్గొన్నారు.

మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

కొండపాక, జూలై 17 :(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేసి కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు అమ్ముల బాల్ నర్సయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల విస్తృత సమావేశం రవీంద్ర నగర్‌లో గురువారం జరిగింది. ఈ సందర్భంగా అమ్ముల బాల నర్సయ్య మాట్లాడుతూ మల్టీ పర్పస్ విధానంతో కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు పల్లె శ్రీనివాస్, గొడుగు నారాయణ తాటోజు మల్లేశం, దెబ్బేట సుధాకర్ తదితరులు ఉన్నారు.

మొదలైన కట్టమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు



అమ్మవారికి అభిషేకం చేస్తున్న వేద పండితులు, భక్తులు

చిన్నకోడూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): చిన్నకోడూరులో కట్ట మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు గురువారం ప్రారంభయయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో లైట్ మోటర్ వెహికిల్ డ్రైవర్స్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేద పండితులు సంగీత్‌శర్మ బృందం మంత్రోచ్ఛరణాల నడుమ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకోని ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకోవాలి



విద్యార్థులకు నోట్‌బుక్కులను అందజేసిన అలియన్స్ మిత్ర క్లబ్ గవర్నర్ ఈశ్వర్‌చరణ్

మిరుదొడ్డి, జూలై17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఒకలక్ష్యాన్ని ఎంచుకుని దానికి అనుగుణంగా అడుగులు వేయాలని అక్బర్‌పేట-భూంపల్లి మండలవిద్యాధికారి అంజయ్య అన్నారు. గురువారం అక్బర్‌పేట -భూంపల్లి మండలం రామేశ్వరంపల్లి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో అసోసియేషన్‌ఆఫ్ అలియన్స్ క్లబ్ ఇంటర్‌నేషనల్ సిద్దిపేటమిత్ర(162 ఎస్) ఆధ్వర్యంలో నోట్‌బుక్కులను అందజేశారు. అలాగే గ్రామానికి చెందిన పల్లె అనిల్‌కుమార్ అనే యువకుడు టై, బెల్టులను అందజేశారు.

ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు



చిన్నకోడూరులో ఆయిల్ పామ్ మొక్కను నాటుతున్న సిద్దిపేట ఏడీఏ పద్మ

న్యూస్ నెట్‌వర్క్, జూలై 17 (ఆంధ్యజ్యోతి): జిల్లాలో గురువారం ఆయిల్‌పాం మెగా ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొని ఆయిల్‌పాం మొక్కలను నాటారు. రైతులకు ఆర్థికంగా లాభాలు చేకూరుస్తుందని మద్దూరు డీఏవో రాధిక, సిద్దిపేట ఏడీఏ పద్మ అన్నారు. గురువారం మండలంలోని రేబర్తి గ్రామంలో చిలుపూరి అనిల్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో 22 ఎకరాల్లో మద్దూరు డీఏవో రాధికమొక్కలు నాటారు. కొండపాక మండలం బందారం గ్రామంలో వ్యవసాయ శాఖ అధికారి శివరామకృష్ణ ఆయిల్‌పాం మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌లో భాగంగా కామిరెడ్డి నరసింహారెడ్డి పొలంలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో 285 మొక్కలను నాటారు. ఆయిల్ పామ్ సాగుతో ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని ఆత్మ కమిటీ చైర్మన్ మద్దూరి మల్లారెడ్డి అన్నారు. ఆయిల్‌పాం సాగును రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, రైతులకు డ్రిప్‌తో పాటు మొక్కలపై సబ్సిడీని అందిస్తుందని గజ్వేల్ మార్కెట్ కమిటీ చెర్మన్ వంటేరు నరేందరెడ్డి అన్నారు. గతేడాది 570 ఎకరాల్లో ఆయిల్‌పాం పంటను సాగు చేయగా, ఈ ఏడాది 200 ఎకరాల్లో సాగు చేసేలా ప్రభుత్వం నిర్దేశించినట్లు తెలిపారు. ఆయిల్‌పాం పంటలు వేసిన రైతులకు ఏడాదికి ఎకరాకు రూ. 4200 చొప్పున నాలుగేళ్ల వరకు పెట్టుబడి ప్రోత్సాహకంగా ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు.

ఇష్టంతో కష్టపడి చదివితే అనుకున్నది సాధించవచ్చు

కొండపాక, జూలై 17 (ఆంధ్రజ్యోతి): బాగా చదువుకుని ఉన్నతంగా ఎదగడం కొంత కష్టమనిపించినప్పటికీ లక్ష్యంపై దృష్టి పెట్టి చదివినట్లైతే అనుకున్నది సాధించవచ్చని ఇంపాక్ట్ మోటివేషనల్ స్పీకర్ నర్రా భగవాన్ రెడ్డి అన్నారు. గురవారం బందారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలపై ప్రసంగించారు. విద్యార్థులు నిర్దేశిత లక్ష్యాలపై కలలు కనాలి. ఆ కలల సాకారం కోసం నిరంతరం శ్రమించాలన్నారు. అందుకుగాను గురువుల బోధనలను, సలహాలను తప్పకుండా పాటించాలన్నారు. ఎవరి జీవితాలను వారే తీర్చిదిద్దుకోవడానికి పాఠశాలలు పునాదులుగా నిలబడతాయన్నారు. కాలాన్ని వృథాగా గడపకుండా సత్ప్రవర్తనతో మంచి ఆలోచనలతో గడపాలన్నారు. కనిపించేది తల్లిదండ్రులైతే మనల్ని తీర్చిదిద్దేది జీవితాలకు సార్థకత చేకూరేలా చేసేది ఉపాధ్యాయులన్నారు. విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదిగి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు కీర్తి తేవాలని సూచించారు .